## ప్రజా సమస్యలపై పోరాటాలు : చుక్కయ్య

పరకాల, డిసెంబర్ 6, ప్రభాతవార్త

ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై తమ పార్టీ నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.చుక్కయ్య అన్నారు. పట్టణంలోని స్వర్ణ గార్డెన్స్‌లో డి.రాజేందర్ అధ్యక్షతన బుధవారం జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సీరోలు ఘటనకు కారకుడైన వెంకట్‌రెడ్డిని అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివిజన్ కన్వీనర్ బి.సాయిలు, నాయకులు రాజు, రాజయ్య, సారంగపాణి, జలాలొద్దిన్, నరేష్, చంద్రమౌళి, రామకృష్ణ, రత్నం, రాజేందర్, రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 'ఉద్యమ సంస్థతో పార్టీకి సంబంధం లేదు'

రేగొండ, డిసెంబర్ 6, ప్రభాతవార్త

లోక్‌సత్తా ఉద్యమ సంస్థతో ఇటీవల ఆవిర్భవించిన లోక్‌సత్తా పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ప్రజారాజ్యం జిల్లా కోఆర్డినేటర్ కామిడి సతీష్‌రెడ్డి, జిల్లా యువజన కార్యదర్శి సామల శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్ళుగా పనిచేసిన విధంగానే లోక్‌సత్తా లక్ష్య సాధనకు కృషి చేస్తుందన్నారు. గ్రామకమిటీలు నిర్మించి ఉద్యమం బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు లోక్‌సత్తాలో చేరి అవినీతి, అక్రమాలపై పోరాడాలని కోరారు.

### సిసిఐ ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు

సిసిఐ ద్వారా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మూల రాంరెడ్డి, తిప్పర్తి రఘుపతిరెడ్డి పేర్కొన్నారు. కిసాన్‌సెల్ బృందం పరకాల, రేగొండ, భూపాలపల్లి, చిట్యాల, జనగామ మండలాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు కాంగ్రెస్ నాయకులు కె.దేవేందర్‌రెడ్డి, ఆదిరెడ్డి, జి.శంకరయ్య, కె.చంద్రయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పొదుపు సంఘాల సమావేశం

చిట్యాల, డిసెంబర్ 6, ప్రభాతవార్త

మండలంలోని నవాబుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళా పొదుపు సంఘాలకు సమావేశం బుధవారం జరిగింది. ఎస్‌జిఎస్‌వై పథకం కింద జాయింట్ స్క్రీనింగ్ నిర్వహించారు. సర్పంచ్ తీగల సారయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంధ్రాబ్యాంకు మేనేజర్ సత్యనారాయణశర్మ, ఎంపిటిసి పి.ఓదెలు, ఎం.రవీందర్‌రావు, వెలుగు సిసి రఘోత్తంరెడ్డి, ఎంబికె రాజేందర్, సూపరింటెండెంట్ కె.రమేష్, గ్రామకార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఎబివిపి ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ

భూపాలపల్లిరూరల్, డిసెంబర్ 6, ప్రభాతవార్త

ఎబివిపి ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ద్విచక్ర వాహన ర్యాలీ బుధవారం జరిగింది. ఈనెల 26నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే 52వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ హనుమాన్ దేవాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా కాలనీల్లో సైకిళ్ళు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎ.గణపతి, నాయకులు డి.సుధాకర్, అజయ్, రామయ్య, పృథ్వీకిరణ్, సునిల్, సంపత్‌రాజ్, లతీఫ్, విజయ్, రాజేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మహత్యాయత్నాలపై విచారణ జరపాలి

భూపాలపల్లిరూరల్, డిసెంబర్ 6, ప్రభాతవార్త

కురవి మండలం సీరోలు గ్రామంలో ఆరుగురు దళితులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి దారితీసిన పరిస్థితులపై విచారణ జరిపించి దోషులను శిక్షించాలని ఎమ్మార్పీఎస్ ములుగు డివిజన్ కార్యదర్శి ఆర్.కొమురయ్య, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సారయ్య, నాయకులు జె.పోశం, ఆర్.నర్సయ్య, ఎ.రంగయ్య డిమాండ్ చేశారు. దోషులు, ఎస్.ఐపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# కోల్‌బెల్ట్ భూపాలపల్లి వార్త

## మైనింగ్ స్టాఫ్ సమస్యలపై రాజీలేని పోరాటం

భూపాలపల్లి, డిసెంబర్ 6, ప్రభాతవార్త

సింగరేణి వ్యాప్తంగా మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేయనున్నట్లు మైనింగ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్(ఎంటిఎస్ఎ) కేంద్ర కమిటి ఆర్గనైజింగ్ సెక్రటరి అప్పని శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9న రామగుండం రీజియన్ కమ్యూనిటీ హాల్‌లో ఎంటిఎస్ఎ సమావేశం నిర్వహిస్తున్నందున సింగరేణిలోని అన్ని డివిజన్ల నాయకత్వం హాజరు కావాలని కోరారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, గుర్తింపు సంఘం ఎన్నికల కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు చెప్పారు. రామగుండం రీజియన్‌లో గల అడ్‌హాక్ కమిటీల స్థానంలో పూర్తి స్థాయి కార్యవర్గాన్ని నియమిస్తామన్నారు. మైనింగ్ సూపర్‌వైజర్ స్టాఫ్‌కు క్యాడర్ స్కీంను అమలు చేయడంలో యాజమాన్యం, గుర్తింపు సంఘాలు దాటవేసే ధోరణిని ప్రదర్శిస్తున్నాయని, అండర్‌గ్రౌండ్ చార్జి విషయంలో మైనింగ్ స్టాఫ్‌కు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. 1996 నుంచి ఎస్ఎఫ్‌సిలో యాక్టింగ్ చేస్తున్న 126 మంది ఉద్యోగుల పర్మినెంట్, బెల్లంపల్లి రీజియన్‌లో మైనింగ్ స్టాఫ్‌పై విధించిన మస్టర్ల కోత విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై తీర్మానాలు చేయనున్నట్లు శ్రీనివాస్ వివరించారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన పొందాలి : ఎంపిపి

భూపాలపల్లిరూరల్, డిసెంబర్ 6, ప్రభాతవార్త

మహిళలు స్వయంశక్తితో ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎంపిపి దాసరి సమత అన్నారు. జిల్లా సాక్షరతా సమితి ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణా కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని కోరారు. ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌దాస్ మాట్లాడుతూ ఎంబ్రాయిడరీ, విస్తారాకులు, అల్లికల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామారావు, ఎమ్మెల్వో దేవానాయక్, ఎంపిటిసి ఎస్.శ్వాతి, ప్రేరక్‌లు, మహిళలు పాల్గొన్నారు.

## సిసిఐ ద్వారా మద్దతు ధర కల్పించాలి

భూపాలపల్లిరూరల్, డిసెంబర్ 6, ప్రభాతవార్త

రైతుల పంట ఉత్పత్తులకు సిసిఐ ద్వారా మద్దతు ధర కల్పించాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల మహేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని గొర్లవీడు, నేరేడుపల్లి, గుడాడ్‌పల్లి గ్రామాల్లో బుధవారం జరిగిన గ్రామకమిటి సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. విద్యుత్ సరఫరా సక్రమంగా చేయడం లేదని, మద్దతు ధర కల్పించడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.తిరుపతి, ఆర్.రవీందర్, బి.తిరుపతి, సంపత్, వీరాచారి, కోఆప్షన్ సభ్యుడు మొయినొద్దిన్, కె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




## రాత్రిపూట కరెంట్ వద్దు : రాజీపేట రైతులు

పరకాలరూరల్, డిసెంబర్ 6, ప్రభాతవార్త

రాత్రిపూట కరెంట్ సరఫరా వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మండలంలోని రాజీపేట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామస్తులు సర్పంచ్ దామెర మొగిలితో కలిసి విద్యుత్ శాఖ ఎడిఇకి బుధవారం వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయానికి రాత్రి 9నుంచి ఉదయం 4గంటల వరకు విద్యుత్ సరఫరా చేయడం వల్ల అనర్థాలు జరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రిపూట సరఫరా చేసే కరెంట్‌ను పగటి వేళల్లో ఇవ్వాలని వారు కోరారు.

## 'ఈ - సాగు' రైతులకు ఐసిఐసిఐ బ్యాంక్ రుణాలు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త

ఈ-సాగు రైతులకు ఐసిఐసిఐ బ్యాంక్ నేరుగా రుణాలను అందిస్తుందని ఆ బ్యాంక్ సిఇఓ సుందరరాజన్ సంపత్ రైతులకు తెలిపారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని ఈ సాగు రైతుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ఈ-సాగు ప్రాజెక్టు అధినేత పోలెపల్లి క్రిష్ణారెడ్డి అధ్యక్షతవహించారు. ఈ సందర్భంగా సుందరరాజన్‌సంపత్ మాట్లాడుతూ రైతులకు నేరుగా పంటరుణాలను అందించేందుకు ఐసిఐసిఐ బ్యాంక్ సిద్దంగా ఉందన్నారు. పంటకు సరిపడు రుణాన్ని అందించి, దిగుబడి అందిన తర్వాత రైతుల నుండి ఇచ్చిన మొత్తాన్ని వసూలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తక్కువ వ్యవసాయ పొలం ఉన్న రైతులు భూమికి సంబంధించిన పహానీ నకల్, ఫోటోలను అందించి రుణాన్ని మంజూరీ చేయించుకోవాలన్నారు. పంటకు సరిపడు ఎరువులతో పాటు కూలీ డబ్బులను అందిస్తామని ఆయన తెలిపారు. రైతుకు ఏకమొత్తంగా డబ్బులు చేతికి ఇవ్వడం జరగదని, కేవలం పంట సంరక్షణ కోసం రుణాలను అందించడం జరుగుతుందన్నారు. రుణం ఎంత మంజూరైనా, రైతు తీసుకున్న అప్పును బట్టే వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సాగు ప్రాజెక్టు అధినేత క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ నారుమడి తయారు చేసిన నాటి నుండి మొదలుకొని పంట కోసే వరకు ఈ సాగు సేవలు అందించనున్నట్లు తెలిపారు. పైరుకు ఏ



మల్కాపూర్‌లో ఈ సాగు రైతులతో మాట్లాడుతున్న బ్యాంక్ అధికారులు

విధమైన తెగులు వస్తుందనే విషయాన్ని ఎప్పటికప్పుడు పరిక్షించి రైతుకు సూచనలు సలహాలను అందించనున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు సూచించిన మందులను వాడి మంచి దిగుబడులను రైతులు అందుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ ఏడాది 35 గ్రామాల్లో ఈ సాగు సేవలు అందుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ కట్ట బీరప్ప, వ్యవసాయ శాస్త్రవేత్త జైవీర్‌తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సేంద్రీయ పద్ధతులతో అధిక దిగుబడి

కేసముద్రం, డిసెంబర్ 6,ప్రభాతవార్త

పత్తి పంటలో సేంద్రీయ పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి, అభివృద్ధి చెందాలని వ్యవసాయ శాఖాధికారులు సురేష్, శ్రీనాథ్‌లు రైతులకు సూచించారు. కేసముద్రం విలేజిలో సంస్కార్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పత్తి ప్రదర్శన క్షేత్రాన్ని వ్యవసాయాధికారులు, రైతులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు అవలంబించడంవల్ల భూసారం పెరుగుతుందన్నారు. వేసవి దుక్కుల్లో కాంప్లెక్స్ ఎరువులైన డిఎపి, కోరమాండల్, సూపర్ వంటి వాటిని సరైన మోతాదులో వేయాలని సూచించారు. రెండేళ్ళుగా వివిధ ప్రాంతాల్లో ఈ సొసైటీ ఆధ్వర్యంలో పత్తి పంటపై రైతులకు శిక్షణ కార్యక్రమాలను చేపడుతున్నారు. వివిధ మండలాల్లోని లక్ష్మీపురం, నారాయణపురం గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓ.ప్రభాకర్‌రెడ్డి, కె.నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్యామ్

## లక్నవరంలో ఉచిత పశువైద్య శిబిరం

గోవిందరావుపేట, డిసెంబర్ 6, ప్రభాతవార్త

మండలంలోని లక్నవరంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ గోపాలమిత్ర సెంటర్, ఆంధ్రప్రదేశ్ పశుగ్రాణాభివృద్ధి సంస్థ, వెట్ ఇండియాలు సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి నర్సంపేట డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వాసిరగాని శ్యామ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి, చూడి గేదెలలో వచ్చే సమస్యలతో పాటు వాటి పరిష్కారం గురించి రైతులకు వివరించారు. పంటల తరువాత రైతును ఆదుకునేది పాడేనన్నారు. రైతులు పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.

ఈ శిబిరంలో 108 గేదెలకు చూడిపరీక్షలు నిర్వహించి తగిన మందులను అందించారు. ఏడు గేదెలకు కృత్రిమ గర్భదారణ చేశారు. ఎదకు రాని గేదెల పట్ల జాగ్రత్తలు వివరించి మందులు అందించారు. దూడలకు నట్టలమందు సరఫరా చేశారు. శిబిరానికి ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి, వెట్ ఇండియాలు మందులను అందించాయి. ఈ కార్యక్రమంలో నర్సంపేట పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.రంగారావు, చెన్నారావుపేట పశువైద్యాధికారి డాక్టర్ సి.యాకుబ్‌రెడ్డి, స్థానిక పశువైద్యాధికారి వి.సురేష్‌కుమార్, ఉప్పరపల్లి పశువైద్యాధికారి తిరుపతిరెడ్డి, పస్రా పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి బి.నారయణ, గోపాలమిత్రరాజు, సహకార సంఘ అధ్యక్షులు ఈదునూరి వెంకటపాపిరెడ్డి, వెట్ ఇండియాప్రతినిధి జి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.